# ప్రజా మారుపు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 275  పేజీలు : 04  వెల రూ. 2  శుక్రవారం 08 - 05 - 2026




తెలంగాణలో రియల్ ఎస్టేట్‌పై 'విలువల' భారం.. భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు!

### మే 20లోగా డబుల్ బెడ్ రూం
# ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో విడుదల చేయాలని పొంగులేటి ఆదేశం
- ఈనెల 20లోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్న మంత్రి
- భూముల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచన
- లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**హైదరాబాద్ :**

ఈనెల 20వ తేదీలోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మంత్రి సూచించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సేకరించి వినియోగించని భూముల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు దానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు, నిజమైన భూ యాజమానులకు చట్టపరంగా హక్కులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి నల్గొండ, - మిగతా 2 లో

### పక్కా ప్లాన్ తో
# నాపై హత్యాయత్నం



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- కరీంనగర్ లో కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ శ్రేణులు
- కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో దాడి చేశారన్న కౌశిక్
- తనను చంపే అవకాశం ఉందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మండిపాటు

**హైదరాబాద్ :**

కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే - మిగతా 2 లో



2 లో

### హైదరాబాద్‌లో మరో
# మెట్రో అద్భుతం

- భూమి లోపల, పైన, ఆకాశంలో ప్రయాణం!
- హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మాణం
- అండర్‌గ్రౌండ్, ఎలివేటెడ్, భూమిపై వెళ్లేలా వినూత్న డిజైన్
- ఈ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

# ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం

- ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు - భారత సైన్యం
- ఆపరేషన్ సిందూర్‌తో ఆ సందేశమిచ్చామన్న సైన్యం
- ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ త్రివిధ దళాల అధిపతుల సమావేశం



2 లో

# పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి వర్మ తొలగింపు



- మీడియా ముందు కన్నీళ్లు
- నియోజకవర్గ పార్టీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు అధిష్ఠానం కసరత్తు
- మీడియా సమావేశంలో భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమైన వర్మ
- కూటమిలో ఇబ్బందులు రాకుండా తానే కమిటీని కోరానని వర్మ వెల్లడి
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ

**అమరావతి :**

పిఠాపురం నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించింది. ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యవహారాలను - మిగతా 2 లో

## రక్షణశాఖ మాజీ మంత్రులకు మరణశిక్ష

- మరణశిక్ష విధించిన చైనా కోర్టు
- అవినీతి వ్యవహారంలో వీ ఫెంగే, లీ షాంగ్‌లపై చర్యలు
- లంచాలు తీసుకోవడంతో పాటు ఇవ్వజూపిన కేసులో లీషాంగ్ దోషి
- మరణశిక్ష విధించినప్పటికీ రెండేళ్ల పాటు వాయిదా



2 లో

## కళ్లు తిరగడాన్ని ముందే పసిగట్టే గెలాక్సీ వాచ్

- శాంసంగ్ సంచలన ఆవిష్కరణ
- శాంసంగ్, కొరియా ఆసుపత్రి సంయుక్త పరిశోధనలో కీలక పురోగతి
- స్పృహ కోల్పోవడానికి 5 నిమిషాల ముందే 84 శాతం కచ్చితత్వంతో హెచ్చరిక
- ప్రపంచంలోనే ఒక కమర్షియల్ స్మార్ట్‌వాచ్ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి
- వైద్య రంగంలో పోస్ట్-కేర్ నుంచి ప్రివెంటివ్ కేర్‌కు మార్పు అని తెలిపిన శాంసంగ్



2 లో

# అతుకులు లేని జాతీయ జెండాతో అద్భుతం



- నేతన్నను అభినందించిన మంత్రి లోకేశ్
- అతుకులు లేని జాతీయ జెండాను రూపొందించిన నేతన్న
- పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుడు సత్యనారాయణకు అంతర్జాతీయ రికార్డులు
- చేనేత కళాకారుడిని అభినందించిన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రకు గుర్తింపు తేవాలన్నదే తన లక్ష్యమన్న సత్యనారాయణ

**అమరావతి :**

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల రామలింగ సత్యనారాయణను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అశోక చక్రంతో సహా ఎలాంటి అతుకులు లేకుండా ఏక వస్త్రంతో జాతీయ జెండాను రూపొందించి, పలు అంతర్జాతీయ రికార్డులు సాధించినందుకు గాను ఆయనకు ఈ ప్రశంసలు దక్కాయి. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణ మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన సత్యనారాయణ, తన అరుదైన నైపుణ్యంతో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, "తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఎగురవేసే 6×12 సైజు జెండాను, తర్వాత ఎర్రకోటపై ఎగురవేసే 8×12 జాతీయ జెండాను తయారు చేశా. ఆంధ్రకు గుర్తింపు రావాలన్న ఆకాంక్షతోనే దేశంలోనే అత్యంత అరుదైన ఏకవస్త్ర చేనేత జాతీయ జెండాను రూపొందించా" - మిగతా 2 లో

# నేను కాదు మనం




- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సింగపూర్ తరహా అభివృద్ధికి ప్రణాళికలు
- క్షేత్ర స్థాయి ఉద్యోగుల అనుభవాన్ని వినియోగించుకోవాలి
- సింగపూర్ ఉత్తమ విధానాలను ఓ జిల్లాలో అమలు చేద్దాం
- టూరిజం అభివృద్ధి చేసిన జిల్లాకు అత్యధిక ఆదాయం
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి వాటిని సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించాలన్న మంత్రులు

**అమరావతి :**

టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి జరుగుతుందని... నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక నుంచి తాను కూడా నేను అనే పదాన్ని పక్కన పెట్టి మనం అనే పదాన్ని ఉపయోగిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చ జరిగింది. దీంట్లో భాగంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయి. సింగపూర్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేద్దాం. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేపట్టాలి. సింగపూర్ దేశంలో నేను కాదు.. మనం అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూడా నేను కాదు మనం అనే విధానాన్నే అవలంభిద్దాం. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా... సంక్షేమ, అభివృద్ధి జరగుతున్నా.. అందరి కృషి వల్లే సాధ్యమైంది. కలిసి కట్టుగా పని చేస్తే... ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటే ప్రభుత్వం మరింత - మిగతా 2 లో

# ప్రధాన రహదారిపై అస్థిపంజరం వేలాడదీత

**వంగరలో ఆకతాయిల వికృత చేష్టలు**

**భయభ్రాంతులకు గురవుతున్న గ్రామస్తులు**

**తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి**

**భీమదేవరపల్లి మే 07, (ప్రజా మంటలు):** భీమదేవరపల్లి మండలం వంగరలో గత కొద్దిరోజులుగా కొందరు ఆకతాయిలు సాగిస్తున్న అల్లరి చేష్టలు హద్దులు దాటుతున్నాయి. తాజాగా ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెట్టుకు మానవ అస్థిపంజర అవశేషాలను వేలాడదీసి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.వంగర ప్రభుత్వ ఆసుపత్రి నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో ఒక చెట్టుకు మానవ పుర్రె, వెన్నుపూస,చేతి ఎముకలను గుర్తు తెలియని వ్యక్తులు వేలాడదీశారు. గత రెండు వారాలుగా ఈ వికృత దృశ్యం కనిపిస్తున్నప్పటికీ, అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి మంగళవారం వంగరలో జరిగే సంతకు చుట్టుపక్కల గ్రామాల నుండి వందలాది మంది మహిళలు వస్తుంటారు. అయితే, ఈ అస్థిపంజరాన్ని చూసి భయపడి, గత రెండు వారాలుగా సాయంత్రం వేళల్లో మార్కెట్‌కు రావడానికి మహిళలు జంకుతున్నారు.రెండేళ్ల క్రితం కూడా ఇదే ప్రాంతంలో మేకను బలి ఇచ్చి రోడ్డుపై పడేసిన సంఘటన జరిగింది. అప్పట్లో ఎస్.ఐ వెంకటేశ్వర్లు స్వయంగా స్పందించి వాటిని తొలగించి ధైర్యం చెప్పారు. ఇప్పుడు మళ్ళీ అటువంటి ఘటనే పునరావృతం కావడం గమనార్హం.స్థానిక ఆకతాయిలే ఈ పనికి పాల్పడి ఉంటారని గ్రామస్థులు బలంగా అనుమానిస్తున్నారు.క్షుద్ర పూజల పేరుతోనో లేదా ప్రజలను భయపెట్టి డబ్బులు గుంజడానికో ఎవరో కావాలనే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బైక్ రేసింగ్‌లతో రోడ్లపై హంగామా చేస్తున్న వీరు, ఇప్పుడు ఇలాంటి వికృత పనులకు ఒడిగట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తక్షణమే పోలీసులు రెవెన్యూ యంత్రాంగం స్పందించి,ఆ మానవ అవశేషాలను అక్కడి నుండి తొలగించాలి. ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను పోగొట్టి, ఈ వికృత చేష్టలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వంగర గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# ఆశయమే పునాది.. ఆశయమే పయనం లక్ష్యాన్ని వీడొద్దు!

**సికింద్రాబాద్, మే 07 (ప్రజా మంటలు):** ప్రపంచంలో ప్రతి మహోన్నత ప్రయాణం వెనుక ఒక చిన్న ఆలోచన, అంతకు మించిన బలమైన లక్ష్యం ఉంటుంది. అది ఒక వ్యాపారమైనా, ఒక స్వచ్ఛంద సంస్థ అయినా, లేదా ఒక సామాజిక ఉద్యమమైనా.. సమాజానికి ఏదో ఒకటి చేయాలన్న తపన, ఒక కల నుంచే ఉద్భవిస్తాయి. సంస్థ ఏదైనా సరే, ఆరంభంలో ఉండే ఆశయం మరియు పట్టుదలే దానికి అసలైన పునాదిని వేస్తాయి. అయితే ప్రయాణం సాగుతున్న కొద్దీ పరిస్థితులు మారుతుంటాయి, కొత్త వ్యక్తులు చేరుతుంటారు, అవకాశాలు తలుపు తడుతుంటాయి. ఈ క్రమంలోనే చాలామంది తమ అసలు లక్ష్యాన్ని పక్కనబెట్టి లాభాలు, కీర్తి ప్రతిష్టల వెంట పరుగులు తీస్తుండటం నేటి సమాజంలో కనిపిస్తున్న విచారకరమైన వాస్తవం.ఒక స్వచ్ఛంద సంస్థకు గుర్తింపు వచ్చేది అది చేసే సేవా కార్యక్రమాల ద్వారానే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రజల్లో ఏర్పడే నమ్మకం, గౌరవం ఆ సేవా పథం నుంచే పుట్టుకొస్తాయి. దురదృష్టవశాత్తూ కొన్ని సందర్భాల్లో గుర్తింపు వచ్చిన తర్వాత ఆరంభంలో ఉన్న సేవా గుణం తగ్గుతూ వస్తోంది. ప్రచారం పెరిగే కొద్దీ బాధ్యతను విస్మరించడం సరైన పద్ధతి కాదు. ప్రజల అవసరాలు ఉన్నంత కాలం అదే అంకితభావంతో ముందుకు సాగడమే నిజమైన సేవా ధర్మం. ఒక సంస్థ గొప్పతనం అనేది కేవలం ప్రారంభ వేడుకల్లోనో, ఆర్భాటాల్లోనో ఉండదు. కాలం గడిచినా తొలినాటి నిబద్ధతను చాటుకోవడంలోనే ఆ సంస్థ అసలు విలువ దాగి ఉంటుంది.వ్యాపారం అంటే కేవలం లాభార్జనే కాదు, అది ఒక సామాజిక బాధ్యత కూడా. కంపెనీ అనేది ఒక ఆలోచనకు ప్రతిరూపం కావాలి. ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా సమాజం పట్ల మనకున్న బాధ్యతను కార్యరూపంలో చూపించాలి. కాలానికి అనుగుణంగా పని చేసే పద్ధతులు, విధానాల్లో మార్పులు రావడం సహజం. కానీ ఒక సంస్థ యొక్క ప్రాథమిక లక్ష్యం, దృక్పథం ఎప్పటికీ మారకూడదు. తన ఉద్దేశాన్ని విస్మరించిన సంస్థ బయటికి ఎంత భారీగా కనిపించినా, లోపల మాత్రం శూన్యంగా మిగిలిపోతుంది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన సంస్థల విజయ రహస్యం తమ మూల విలువలను గౌరవించడమే. వ్యక్తి అయినా, సంస్థ అయినా ఉన్నత శిఖరాలకు చేరడం ఎంత ముఖ్యమో, అసలు ఈ ప్రయాణాన్ని ఎందుకు మొదలుపెట్టామో గుర్తుంచుకోవడం అంతకంటే ముఖ్యం. లక్ష్యం ఉన్న ప్రయాణం దిశను చూపుతుంది, ఆ దిశే స్థిరమైన విజయాన్ని అందిస్తుంది. అందుకే ఎన్ని మార్పులు వచ్చినా, ఎంతటి పేరు ప్రఖ్యాతులు లభించినా ప్రారంభించిన లక్ష్యాన్ని ఎన్నడూ వదులుకోవద్దని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.-వై. సంజీవ కుమార్‌ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్ & స్కై ఫౌండేషన్ ట్రస్ట్9393613555 / 9493613555.



# భీమ్ రాజ్ పల్లిలో ముగిసిన క్రికెట్

**యువతలో ప్రతిభను వెలికితీయడమే బి బి కే ఫౌండేషన్**

**లక్ష్యం బొమ్మన కుమార్**

**గొల్లపల్లి మే 07ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం భీమ్ రాజ్ పల్లి వారం రోజులుగా అత్యంత ఉత్సాహభరితంగా సాగిన బి బి కే బి ఆర్ పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మండలంలోని వివిధ ప్రాంతాల నుండి 12 జట్లు తలపడగా, తుది పోరులో లక్ష్మీపూర్ జట్టు ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భీమ్ రాజ్ పల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది.విజేతలకు బహుమతుల ప్రధానంటోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి విజేత లక్ష్మీపూర్ జట్టుకు 10,000 నగదు మరియు ట్రోఫీని అందజేశారు. ఈ ప్రైజ్ మనీని సర్పంచ్ తన తండ్రి స్వర్గీయ కొలగాని వెంకయ్య జ్ఞాపకార్థం అందజేయడం విశేషంఅదేవిధంగా, రన్నరప్‌గా నిలిచిన భీమ్ రాజ్ పల్లి జట్టుకు ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ,ఆమె కుమారులు బి బి కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్, నరేందర్ 5,000 ట్రోఫీ బహుమతిని అందజేశారు మేనేజ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ కీపర్ లకు ట్రోఫీలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత గంగాచారి మాట్లాడుతూ.. యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు తండ్రి జ్ఞాపకార్థం క్రీడాకారులను ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. బి బి కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన కుమార్ మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంత యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంది. వారికి సరైన వేదికను కల్పించడమే బి బి కే ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలి. భవిష్యత్తులో కూడా యువత కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తాం" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు దాసరి తిరుపతి గౌడ్, జెల్లా అఖిల అనిల్, జక్కుల పావని దస్తగిరి, కాషా అంజలి గంగాధర్, కంది స్వామి, సింగారపు లచ్చయ్య, సామల జనార్ధన్, బొమ్మన వెంకటేశం,టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న

**ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**

**జగిత్యాల రూరల్ మే 7 (ప్రజా మంటలు) :** మండలం పోలాస గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారం కార్యక్రమంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు,విద్యుత్ శాఖ పి ఏం కుసుమ్ పై అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ .అనంతరం రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్ ను పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు.పేద మధ్యతరగతి ప్రజలకు అందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు. జగిత్యాల నియోజకవర్గం లో 78 వేల ఇళ్లకు ఉచిత కరెంట్ అమలు చేయడం జరుగుతుంది.పోలాస గ్రామంలో దాదాపు 1000 ఇండ్లకు ఉచిత కరెంట్‌గ్రామంలో 1800 మందికి రేషన్ కార్డులు ఉన్న వారికి సన్న బియ్యం పంపిణీ సోలార్ ఉపయోగంతో పర్యావరణానికి హాని కలగకుండా విద్యుత్ ఉత్పత్తి .ప్రజలు నూతన అవకాశాలు ఉపయోగించుకోవాలి..మహిళా సమాఖ్య సభ్యులు ప్రమాదవషాత్తు మరణిస్తే 10 లక్షల,సహజ మరణం 2 లక్షలు వస్తాయి.మహిళ సమాఖ్య లో సభ్యులుగా చేరి ప్రభుత్వం పతకాలు లబ్ధి పొందాలి అన్నారు.రాష్ట్ర ప్రజలకు అందరికీ 5లక్షల చొప్పున ఇందిరమ్మ బీమా పథకం త్వరలో అమలు చేయబోతున్నాం.. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు రైతులు ఉపయోగించుకోవాలి. సివిల్ సప్లై కార్పొరేషన్, మార్క్ ఫెడ్ రెండు కూడా నష్టాల్లోనే ఉన్నాయి అన్నారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల నుండి పంట సాగు బడి అంశాలు నేర్చుకోవాలని రైతులు పంట సాగు పై పెట్టుబడి తగ్గించి లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య, డి ఏ ఓ భాస్కర్,సర్పంచ్ శంకర్, ఎస్ ఈ సుదర్శన్, ఏ ఎం సి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, డి ఈ గంగారం, ఏ డి ఏ తిరుపతి నాయక్, ఏ డి ఈ జవహర్ నాయక్, ప్రొఫెసర్ సుజాత, సైంటిస్ట్ రవి,నాయకులు నక్కల రవీందర్ రెడ్డి బాల ముకుందం రౌతు గంగాధర్ చిర్ర నరేష్ జయరామ్ సురేష్ గంగారెడ్డి వెంకట రెడ్డి భారతపు భూమయ్యా గ్రామ మండలనాయకులు ,రైతులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దాడి చేసిన వారిని అరెస్టు చేయడంతో పాటు ఏ 1 గా బండి సంజయ్ పై విచారణ చేపట్టాలి

**బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన**

**కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి**

**జగిత్యాల మే 7(ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డిమాజీ జెడ్పీ ఛైర్పర్సన్ దావా వసంత,మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, వైస్ చైర్మన్ హరిచరన్ రావు తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కేటీ ఆర్ ను పాత్రికేయులు చిట్ చాట్ లో అడిగిన ప్రశ్నకు సమాధానంగారేవంత్ రెడ్డితో బండి సంజయ్ కి అంతర్గతంగా ఒప్పందాలు వారికే తెలియాలి..కాందిశీకుల వివరాలు అవసరమైనప్పుడు బయట పెడతా అంటే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నావ్ పని ప్రశ్నించారుకాందిశీకులు అంటే..దొంగతనం బయట పెట్టినట్లు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు.బండి సంజయ్ మాటలు మానవత్వం ఉన్న మనిషి ఎవరు మాట్లాడని భాష మాట్లాడారన్నారు.బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..విమర్శలు సభ్య సమాజం అంగీకరించేలా ఉండాలి.గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసులో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి సభ్య సమాజానికి సిగ్గు చేటు..కరీంనగర్ దొంగతనం జరిగి ఐదు రోజులు గడుస్తున్నాయి.. దొంగలను పట్టుకోలేకపోయారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా...ఆటవిక పాలన కొనసాగుతోంది..కుమ్మక్కు రాజకీయాలతో గన్ కల్చర్ ప్రోత్సహిస్తున్నారు.రాష్ట్ర హోం శాఖ మంత్రి రేవంత్ రెడ్డికేంద్రంలో హోమ్ శాఖా సహాయ మంత్రి కుమ్మకు అయి వారి వైఫల్యాలను ఎండగడితే కౌశిక్ రెడ్డి పై దాడి, హత్య ప్రయత్నం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు న్యాయ పరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.. ప్రతి విమర్శలు చేసే అవకాశం ఉండగా భౌతిక దాడులతో కరీంనగర్ లో బండి సంజయ్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నారు.మోడీ నేర్పిన పాఠాలు ఇవేనా..అని నిలదీశారు.దాడి చేసిన వారిని ప్రోత్సహిస్తున్న కేంద్ర హోమ్ శాఖ సహా మంత్రి బండి సంజయ్ను ఏ 1 గా చేర్చి విచారణ చేపట్టాలి..హింస తో బీ ఆర్ ఎస్ పార్టీ నీ అణచివేయలని చూస్తే మీతో కాదు..ఎవరితో కాదు..అని హెచ్చరించారు.బండి సంజయ్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి అని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.





# కలెక్టరేట్ అధికారులు గైర్హాజరు సమాచార కమీషన్ ఆదేశాలు భేఖాతర్

**షోకాజ్ నోటీసులకు దారి? ఎక్సైజ్ ఎస్సైపై ఆరోపణలు**

**హైదరాబాద్, మే 07 (ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్‌లో గురువారం జరిగిన విచారణలకు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ అధికారులు గైర్హాజరైన ఘటన వివాదాస్పదంగా మారింది. సమాచార కమీషన్ ఆదేశాలను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించారని సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి ఆరోపించారు.గత కొన్ని సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం కింద అడిగిన వివరాలను ఇవ్వకుండా తప్పించుకుంటున్న అధికారులు, ఇప్పుడు కమీషన్ ముందు కూడా హాజరు కాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. గురువారం కలెక్టరేట్‌కు సంబంధించిన నాలుగు కేసులపై విచారణ జరిగినట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సమాచార కమీషన్, బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. పారితోషికం (పెనాల్టీ) విధించడం లేదా షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని గంగారెడ్డి వెల్లడించారు.ఇక మరో కేసులో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖకు చెందిన ఎస్సై యం.ఎ. జమీల్ కమీషన్ ఎదుట హాజరయ్యారు. బుగ్గారం మండలం గోపులాపూర్ వైన్స్ దోపిడీ కేసుకు సంబంధించి ఆయన సమర్పించిన సమాచారం అసంపూర్తిగా, పొంతనలేని విధంగా ఉందని గంగారెడ్డి ఆరోపించారు.ఈ విషయంపై మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్, జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.




# ఖబర్దార్...కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

**బీజేపీ మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్**



**భీమదేవరపల్లి మే 7(ప్రజా మంటలు ):** కరీంనగర్ ఎంపీ,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షులు శ్రీ రామోజు శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...బండి సంజయ్ పై కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ అన్నారు.నిప్పు లాంటి వ్యక్తిత్వం ఉన్న బండి సంజయ్ గురించి మాట్లాడే అర్హత కౌశిక్ రెడ్డికి లేదన్నారు."కౌశిక్ రెడ్డి.. నీ చిల్లర రాజకీయాల కోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే కరీంనగర్ గడ్డపై నీ అడుగు పడనీయమన్నారు.నేను చస్తాను,నా ప్రాణం తీసుకుంటాను' అని నువ్వు ప్రజలను వేడుకుంటే, ఫ్యామిలీ ఒంటరి అయిపోతుందని భావించి మంచి మనసుతో హుజురాబాద్ ప్రజలు ఓటేశారు.అలా గెలిచిన నువ్వు ఇప్పుడు మాట్లాడేది ఇదేనా? ఎందుకు ఓటేశామని హుజురాబాద్ ప్రజలు బాధపడే రోజులు వచ్చాయి" అని విమర్శించారు."సంస్కారం లేని మాటలు మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు.పార్టీలు మారి, స్వార్థ రాజకీయాల కోసం పాకులాడే నీవు,ప్రజల కోసం జైలుకు వెళ్ళిన నాయకుడిని విమర్శిస్తావా? చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్ర నిరసనలు తెలియజేస్తామని, బండి సంజయ్ జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.ఇకనైనా నీ నోటిని అదుపులో పెట్టుకో,లేదంటే తెలంగాణ వ్యాప్తంగా నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# సహకార సంఘం సభ్యుని కుటుంబానికి రూ. 2 లక్షల ప్రమాద బీమా అందజేత

**ఆపద సమయంలో సభ్యులకు అండగా సంఘం**

**అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి**



**భీమదేవరపల్లి మే 07( ప్రజా మంటలు):–** ముల్కనూర్ సహకార సంఘం కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా,సభ్యుల సంక్షేమానికి,భద్రతకే పెద్దపీట వేస్తుందని సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అన్నారు.బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో,ప్రమాదవశాత్తు మరణించిన కొత్తపల్లి గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు అప్పని నాగేంద్రం కుటుంబానికి రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు.కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పని నాగేంద్రం గతేడాది అక్టోబర్ 30, 2025న వాగులో సంభవించిన ఆకస్మిక వరదలో కొట్టుకుపోయి దురదృష్టవశాత్తు మరణించారు.సంఘం తన సభ్యులందరికీ ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా కల్పించిన "జనతా పర్సనల్ యాక్సిడెంటల్ పాలసీ" కింద ఈ క్లెయిమ్ మంజూరైంది.మృతుని భార్య,నామినీ అయిన అప్పని అనితకు ఈ రూ.2 లక్షల బీమా చెక్కును సంఘ ప్రతినిధుల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. "అకాల మరణం పొందిన సభ్యుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఈ బీమా పథకాన్ని అమలు చేస్తున్నాం.ఆపదలో ఉన్న కుటుంబానికి ఈ మొత్తం కొంతైనా ఊరటనిస్తుందని ఆశిస్తున్నాం. సభ్యులందరూ సంఘం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి, ఉపాధ్యక్షులు గజ్జి వీరయ్య,డైరెక్టర్లు గనబోయిన శ్రీనివాస్,కాసిరెడ్డి వసంత, బొల్లంపెల్లి కుమారస్వామి, అంబాల రాములు,బేల కనుకమ్మ,కర్రె మహేందర్, కంది రవిందర్ రెడ్డి,మండ శ్రీనివాస్,చెవ్వల్ల బుచ్చయ్య, ఈర్ల మూగయ్య,గుగులోతు బాషు,గుర్రాల భాస్కర్ రెడ్డి, బొల్లపెల్లి వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాంనగర్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపీ కవిత

**భీమదేవరపల్లి మే 07 ( ప్రజా మంటలు):–** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ తండా చెక్ పోస్టునుసెంట్రల్ జోన్ డీసీపీ కవిత , కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా వారు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీలు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. చెక్‌పోస్టులోని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు.ముఖ్యంగా పశువుల రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా, అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు..ఈ తనిఖీల్లో స్థానిక పోలీసులు ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, వంగర ఎస్సై దివ్య , అధికారులు కూడా పాల్గొన్నారు.





# కన్నతల్లిని కొట్టి ఇంట్లోంచి గెంటేసిన కర్కశ కొడుకు



**జగిత్యాల మే 7(ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన కాముని లక్ష్మి (70) అనే వృద్ధ తల్లిని కొడుకు శ్రీనివాస్ కొట్టి ఇంట్లోంచి గెంటి వేయగా జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. అయన సాయం తో ఆర్డీవో కు ఫిర్యాదు చేసింది. అనంతరం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం లో ఆ వృద్ధ తల్లి విలేకరులతో మాట్లాడుతూ నా భర్త మరణించిన పరిస్థితి లో నాకు ఆరుగురు కొడుకులు ఉన్నప్పటికీ వారు నన్ను పోషించడం లేదని, అనారోగ్యం తో ఉన్న నాకు ఎలాంటి వైద్య ఖర్చులు పెట్టడం లేదని,నా మూడవ కుమారుడు శ్రీనివాస్ నన్ను కొట్టి ఇంట్లోంచి గెంటి వేశాడని, రోదిస్తూ, వారిపై చర్యలు తీసుకోని నాకు న్యాయం కోసం సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ఆర్డీ ఓ కు ఫిర్యాదు చేయగా నా మూడో కొడుకు పై కేసు నమోదు చేశారని, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ సాయం తో జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేస్తానని తెలిపింది. ఫిర్యాదు మేరకు వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం సెక్షన్ 2(ఎ), సెక్షన్ 23 కింద తల్లి ని పోషించని కొడుకులపై, తల్లిని కొట్టి ఇంట్లోంచి గెంటివేసిన మూడో కొడుకపై వృద్ధుల సంరక్షణ చట్టము కింద కేసు నమోదు అయినట్లు, తల్లి దండ్రుల ను నిరాధరణ కు గురిచేసే వారికి 6నెలల జైలు శిక్ష విధించే అధికారం ఆర్డీవో కు ఉందని, తల్లి దండ్రుల నుంచి కొడుకులు తీసుకున్న ఆస్తులను తిరిగి తల్లి దండ్రుల పేరిట మార్చేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు.వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి,ప్రతి నిధులు గౌరి శెట్టి విశ్వనాథం, కే. సత్యనారాయణ, బొబ్బాటి కరుణ తదితరులున్నారు.

# రాజలింగం గౌడ్ ద్వితీయ వర్ధంతి ఆశయాలను కొనసాగిద్దాం

**రాఘవపట్నం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తా**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**గొల్లపల్లి మే 07ప్రజా మంటలు :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కీర్తి శేషులు రాజలింగం గౌడ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజలింగం ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో రాజలింగం గౌడ్ విగ్రహం కుటుంబ సభ్యులు నిర్వహించగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజలింగం గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు సర్పంచిగా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా రాజలింగం గౌడ్ చేసిన సేవలను ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేసుకున్నారు. రాజలింగం గౌడ్ ఆశయ సాధనకు ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న కృషికి తనవంతుగా సహకారం అందిస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తండ్రికి ఆశయ సాధనలో కుమారులు తిరుపతి, అరవింద్, ప్రవీణ్ కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో రాజలింగం గౌడ్ కోడలు భవాని సర్పంచ్ గా ఎన్నికయ్యారని ఎన్నికల సమయంలో భవాని ఇచ్చిన అన్ని హామీలను నెరవేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భీమ సంతోష్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు నిశాంత్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్లు ప్రజా ప్రతినిధులు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సూర్యాపేట జిల్లాలో దారుణం

**కట్టుకున్న భార్యను క్రూరంగా చంపిన భర్త**

**భార్యాభర్తల మధ్య మనస్పర్తలు రావడంతో వేర్వేరుగా దంపతులు**

**భార్యపై కోదాడ పట్టణ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసిన మణిదీప్**

**పెద్దమ్మతో కలిసి స్టేషన్‌కు వచ్చిన శిరీష**



కట్టుకున్న భార్యను కడదాక తోడుండాల్సిన భర్తనే వారి పాలిట కాలయముడై క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. రాష్ట్రంలో తాజాగా హైదరాబాద్, సూర్యాపేట జిల్లా కోదాడలో అనుమానంతో ఒకరు, కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో తమ భార్యలను హత్య చేసి అంతమొందించడం తీవ్ర కలకలం రేపుతోంది.సూర్యాపేట జిల్లా కోదాడ బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని బాబునగర్‌కు చెందిన మణిదీప్ పెద్దలను ఎదిరించి జగ్గయ్యపేటకు చెందిన శిరీషను ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. మణిదీప్ భార్యపై కోదాడ పట్టణ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశాడు.బుధవారం మధ్యాహ్నం భార్య శిరీష తన పెద్దమ్మతో కలిసి స్టేషన్‌కు రావడంతో ఇరువురికి సీఐ శివశంకర్ కౌన్సిలింగ్ ఇచ్చి మరుసటి రోజు వాయిదా వేశారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బస్టాండ్ ఎదుట టీ స్టాల్ వద్ద ఆటోలో శిరీష కూర్చొని ఉంది. అదునుగా భావించిన మణిదీప్ వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణ రహితంగా కడుపులో పొడిచాడు. స్థానికులు నిలువరించే ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. తీవ్ర రక్త స్రావంతో ఉన్న శిరీషను స్థానికులు కోదాడ ప్రభుత్వాసుపత్రి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శిరీషను క్రూరంగా చంపిన నిందితుడు మణిదీప్ కఠినంగా శిక్షించి తమ కుమార్తెకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు అంటున్నారు. కోపంలో భార్య శిరీషను హత్య చేసిన మణిదీప్ నేరుగా పోలీసులకు లొంగిపోగా ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు."నా ఇల్లు కూలిపోతే మేము అక్కడే మాట్లాడుకుంటున్నాము. నా బిడ్డ పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరింది. నేను రానని చెప్పాను. పిల్లాడిని పట్టుకొని చెట్టుకింద కూర్చొమంటే వచ్చాను. ఇప్పుడు నేను ఏం చేయాలి. నా బిడ్డకు న్యాయం జరగాలి.హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో కోపోద్రిక్తుడైన భర్త ఆమెను డంబెల్‌తో కొట్టి హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది. ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ జిల్లాకు చంద్ర భాను సమల్ , సస్మితా సమల్ దంపతులు ఏడాది నుంచి ఫతేనగర్‌లోని శివశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నారు.వీరికి చందన్, చందిని ఇద్దరు సంతానం. మే 5వ రాత్రి భార్య ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానించిన భర్త చంద్ర భాను కోపోద్రిక్తుడయ్యాడు. ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి ఆమె తలపై డంబెల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో సస్మితా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి మార్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఘటనపై హత్య కేసు నమోదు చేసిన సనత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం భార్యభర్తల ఆలోచనలు, పనితీరు, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఒకరిపై ఒకరికి అనుమానం, కోపం వల్ల పసిపిల్లలు బలవ్వక తప్పడం లేదని మానసిక నిపుణులు చెబుతున్నారు. భార్యను భర్త, భర్తను భార్య చంపడం వల్ల వారిపై ద్వేషం మాత్రం తీరుతుంది. కానీ ప్రతి పిల్లాడు ఎదుగుతున్న సమయంలో తల్లిదండ్రులు ఇద్దరూ చాలా అవసరం. ఏ ఒక్కరూ లేకపోయిన ఆ వెలతి జీవితాంతం వారిని వేధిస్తుంది. అందుకే దంపతులు చిన్న చిన్న విషయాలకే కఠిన నిర్ణయాలు తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. భార్యభర్తల కంటే కూడా అమ్మనాన్నల స్థానంలో ఉండి ఆలోచించడం వల్ల త్వందరపాటుగా తీసుకునే నిర్ణయాలను ఆపవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు.

# నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టలా

**ఇది దేనికి ఉపయోగపడుతుంది**

**తరచూ జరుగుతున్నసైబర్ నేరాలపై ఫిర్యాదు**

**చేయలేకపోతున్న బాధితులు**

**ఏపీలో ప్రతి 100 మందిలో 85 మంది పరిస్థితి ఇదే**

**జాతీయ సగటుతో పోలిస్తే వెనుకంజలో ఏపీ**



సైబర్ నేరాల బారిన పడినప్పుడు బాధితులు ఫిర్యాదు చేయగలుగుతున్నారా? ఫిర్యాదుల కోసం పెట్టిన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను ఎంతమంది ఆశ్రయించగలుగుతున్నారు? పోర్టల్‌ను ఎంతమంది ఉపయోగించుకుంటున్నారు? నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఇప్పటి వరకు ఎంతమందికి ఉపయోగపడింది? ఎంత మంది ఫిర్యాదులకు జవాబునిచ్చింది? ఇవన్నీ పరిశీలిస్తే మన రాష్ట్రంలో సైబర్ నేరం జరిగితే ప్రతి 100 మంది బాధితుల్లో 85 మంది వరకు అసలు ఫిర్యాదే చేయలేకపోతున్నారు. ఈ మోసాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో, ఎలా ఫిర్యాదు చేయాలో కనీస అవగాహన కూడా లేకపోవడమే అందుకు కారణం.కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'భారతదేశంలో మహిళలు, పురుషులు-2025' పేరిట ఉన్న నివేదికలోని గణాంకాలు ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ ఫిర్యాదుల్లో ఏపీ అట్టడుగున ఉంది. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ వెనకబడింది.మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలకు గురైన బాధితుల్లో పురుషులు సుమారు 14.3 శాతమైతే, మహిళలు 8.2 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు. మొత్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లోని బాధితుల్లో సుమారు 11.1 శాతం మంది మాత్రమే సైబర్ నేరాలపై ఫిర్యాదు చేస్తున్నారు.అలాగే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో సైబర్ నేరాలకు గురైన బాధితుల్లో పురుషులు 31.8 శాతం, మహిళలు 17.7 శాతం లెక్కన మొత్తం దాదాపు 24.5 శాతం మందే సైబర్ నేరాలపై ఫిర్యాదు చేస్తున్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తంగా చూస్తే పురుషులు 20.2 శాతం, మహిళలు 11.3 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు. అంటే మొత్తంగా సగటున 15.6 శాతం మందే ఫిర్యాదు చేస్తున్నారు.దేశమంతటా చూస్తే సైబర్ నేరాల బాధితుల్లో సుమారు 17.7 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు.రెండేళ్లలో రూ.1,725 కోట్లు మాయం : గత రెండు సంవత్సరాలలో ఏపీ నుంచి సైబర్ నేరాలపై నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు దాదాపు 1.24 లక్షల ఫిర్యాదులు అందగా. అందులో ఎక్కువ మంది బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1930 ద్వారానే కాల్ చేసి ఫిర్యాదు చేశారు. ఆయా నేరాల్లో బాధితులు సుమారు రూ.1,725 కోట్లు వరకు పోగొట్టుకున్నారు. వాటిల్లో కేవలం రూ.211 కోట్లు మాత్రమే పోలీసులు సీజ్ చేయగలిగారు. మోసానికి గురయ్యామని తెలిసిన వెంటనే ఎవర్ని సంప్రదించాలి? ఎవరిని ఆశ్రయించాలి? తదితర అంశాలపై బాధితులకు కనీస అవగాహన ఉండట్లేదు. ఆ దిశగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముంది.ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్, ఓటీపీ మోసాలు, ఐడెంటిటీ థెఫ్ట్ మొదలైన వాటిపై ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకొని వేధింపులు, అశ్లీల చిత్రాలు/వీడియోలను బట్టి మోసం చేయడం, వారికి ఇబ్బంది కలిగిస్తే అటువంటి వాటిపై కూడా ఫిర్యాదు చేయవచ్చు. వీటిని బాధితులు తమ వివరాలు గోప్యంగా ఉంచి కూడా రిపోర్ట్ చేయవచ్చు.మొదట పోర్టల్ ఓపెన్ చేసి, కంప్లైంట్ ఫైల్ చేసే ఆప్షన్‌ను ఎంచుకుని, నిబంధనలు అంగీకరించాలి. తర్వాత లాగిన్ అవ్వాలి. మీ మొబైల్ నంబర్, ఓటీపీ ఉపయోగించి లాగిన్ అవ్వాలి. అనంతరం జరిగిన మోసానికి సంబంధించిన పూర్తి వివరాలు, సమయం, సాక్ష్యాలు (స్క్రీన్‌షాట్‌లు, లావాదేవీల రసీదులు మొదలైనవి) అప్‌లోడ్ చేయాలి.గమనిక: మీకు అనుమానాస్పదంగా ఉన్న ఫోన్ నంబర్లు, సోషల్ మీడియా అకౌంట్లు, లేదా యూఆర్‌ఎల్‌లను కూడా పోర్టల్‌లోని అనే విభాగం ద్వారా ముందస్తుగా రిపోర్ట్ చేయవచ్చు. ఏదైనా సైబర్ మోసం జరిగినప్పుడు "వెంటనే" 1930 నంబర్‌కు కాల్ చేయడం లేదా పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం వల్ల మోసగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేసి, మీ డబ్బును తిరిగి పొందే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

# విజయ్ పార్టీకి మద్దతిచ్చేది లేదు

**స్పష్టం చేసిన అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్**

**తమిళనాడులో మొదలైన రిసార్ట్ రాజకీయాలు**

**పుదుచ్చేరి రిసార్టుకు తరలిన పలువురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు**

**ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన ఎమ్మెల్యేల జాబితా ఇవ్వాలని విజయ్‌కు గవర్నర్ సూచన**

**అన్నాడీఎంకే మద్దతు కోరడానికి సుముఖంగా లేని నటుడు విజయ్**



తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతనంగా ఎన్నికైన 12 మందికి పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఒక రిసార్టుకు తరలించడంతో తీవ్ర గందరగోళం మొదలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీలో విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలకు ఈ పరిణామం బలం చేకూర్చింది.అయితే, ఈ వార్తలను అన్నాడీఎంకే నాయకత్వం తీవ్రంగా ఖండించింది. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని స్పష్టం చేసింది. టీవీకే తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే అవకాశం ఉందని, వారిని కాపాడుకోవడానికే రిసార్టుకు తరలించామని వివరణ ఇచ్చింది. "టీవీకేకు అన్నాడీఎంకే ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదు. పార్టీ చీఫ్ ఈపీఎస్ ఆమోదంతో ఈ విషయం ప్రకటిస్తున్నాను" అని సీనియర్ నేత కేపీ మునుసామి స్పష్టం చేశారు.ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ పార్టీకి మద్దతుపై పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తొలుత మౌనంగా ఉండటంతోనే ఈ గందరగోళం తలెత్తిందని ఎన్డీటీవీతో అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి. ఆయన మౌనం కారణంగా కొందరు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారనే ప్రచారం జరిగిందని అంగీకరించాయి. అయితే, ఇప్పుడు ఈపీఎస్ తన వైఖరిని స్పష్టం చేశారని, టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పడంతో ఎమ్మెల్యేలంతా ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని ఆ వర్గాలు వివరించాయి. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ (5), వామపక్షాలు (4), వీసీకే (2) పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో విజయ్ ఉన్నారు. అయితే, బీజేపీతో గతంలో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకే మద్దతు కోరడానికి విజయ్ సిద్ధంగా లేరని, దానివల్ల భవిష్యత్తులో బీజేపీ ప్రభావం తన ప్రభుత్వంపై పడుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పిస్తేనే ఆహ్వానిస్తామని విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ సూచించినట్లు సమాచారం. దీంతో తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# పరిగిలో కత్తితో యువకుడి వీరంగం

**వికారాబాద్ జిల్లా పరిగిలో పందుల విషయమై తీవ్ర గొడవ**

**పందుల పెంపకందారుడిపై కత్తితో దాడికి యత్నించిన యువకుడు**

**స్థానికులు అడ్డుకోవడంతో తప్పిన ముప్పు**

**కేసు నమోదు కాకముందే రాజీ చేసేందుకు రాజకీయ నేతల రంగప్రవేశం**



వికారాబాద్ జిల్లాలోని పరిగి పట్టణంలో ఓ యువకుడు కత్తితో హల్ చల్ చేయడం తీవ్ర కలకలాన్ని రేపింది. వీధి పందుల విషయంలో తలెత్తిన ఓ చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, కత్తితో దాడి చేసుకునే స్థాయికి చేరింది. ఓ యువకుడు పట్టపగలు కత్తితో వీరంగం సృష్టించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు.వివరాల్లోకి వెళితే, పరిగి బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి పందులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, గత కొన్ని రోజులుగా తన పందులు చనిపోతుండటంతో, కాలనీ వాసులే కారణమని అతను అనుమానించాడు. ఈ విషయమై స్థానిక యువకులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మాట మాట పెరిగి పరస్పర దూషణలకు దారితీసింది.ఈ వాగ్వాదంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ యువకుడు, తన ఇంట్లోకి వెళ్లి పెద్ద కత్తితో తిరిగి వచ్చాడు. వెంకటేశ్‌ను చంపేస్తానంటూ ఆయనపైకి దూసుకెళ్లాడు. దీంతో కాలనీవాసులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. అయితే, అక్కడే ఉన్న కొందరు యువకులు వెంటనే అప్రమత్తమై, కత్తితో ఉన్న యువకుడిని పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది.ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందినప్పటికీ, వారు కేసు నమోదు చేయకముందే స్థానిక రాజకీయ నాయకులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి, వివాదాన్ని సద్దుమణిగేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. పట్టపగలు జరిగిన ఈ ఘటనతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అమెరికాలో విచిత్ర ప్రమాదం.. లారీ క్యాబిన్‌ను చీల్చుకెళ్లిన విమానం టైరు



**హైవేపై వెళ్తున్న లారీని ఢీకొట్టిన విమానం**

**ప్రమాదంలో గాయపడినా అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్**

**ల్యాండింగ్ కోసం కిందకు వస్తూ అదుపుతప్పిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం**

**సంఘటనపై దర్యాప్తు ప్రారంభించిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్**

**ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ప్రకటించిన ఎయిర్‌లైన్స్**

అమెరికాలో అత్యంత రద్దీగా ఉండే ఓ హైవేపై ఊహించని ఘటన చోటుచేసుకుంది. ల్యాండింగ్ కోసం కిందకు దిగుతున్న ఓ ప్యాసింజర్ విమానం, కింద రోడ్డుపై వెళ్తున్న బేకరీ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడినా అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి.వారెన్ బోర్డ్‌లీ జూనియర్ అనే వ్యక్తి గత ఏడేళ్లుగా బేకరీ డెలివరీ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే న్యూజెర్సీ టర్న్‌పైక్ హైవేపై తన లారీలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నెవార్క్ లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ 767 విమానం, అదుపుతప్పి చాలా కిందకు వచ్చింది. దాని ల్యాండింగ్ గేర్ టైర్ ఒకటి లారీ క్యాబిన్ అద్దాలను బద్దలు కొట్టుకుని లోపలికి దూసుకొచ్చింది.ఈ ఘటనలో వారెన్ చేతికి, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రమైన షాక్‌కు గురైనా, అతను వెంటనే తన తండ్రి వారెన్ బోర్డ్‌లీ సీనియర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. "ఒక విమానం నన్ను ఢీకొట్టింది అని నా కొడుకు చెప్పగానే నేను నమ్మలేకపోయాను. దేవుడి దయవల్ల వాడు ప్రాణాలతో ఉన్నాడు. శారీరక గాయాల కన్నా మానసిక గాయం తనని చాలాకాలం వెంటాడుతుంది" అని బాక్సింగ్ హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కార గ్రహీత అయిన బోర్డ్‌లీ సీనియర్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం బోర్డ్‌లీ జూనియర్ ఇంట్లోనే కోలుకుంటున్నాడు. ఈ ఘటనపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) దర్యాప్తు ప్రారంభించింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, ప్రయాణికులకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి గాయాలు కాలేదని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది.

## విజయ్ గెలుపు రహస్యం చెప్పిన తెలంగాణ మంత్రి వివేక్



**తమిళనాడులో విజయ్ గెలుపుపై మంత్రి వివేక్ వ్యాఖ్యలు**

**సోషల్ మీడియా రీల్స్ కూడా విజయ్ గెలుపునకు కారణమన్న వివేక్**

**యువ నాటకోత్సవాల వేదికగా ఆసక్తికర విశ్లేషణ**

**కళలకున్న శక్తికి విజయ్ గెలుపే నిదర్శనమని వెల్లడి**

**పాఠశాలల్లో సంగీతం, నాట్యం కోర్సులుండాలని సూచన**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సృష్టించిన ప్రభంజనంపై తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయ్ అద్భుత విజయానికి సోషల్ మీడియాలో చేసిన 'రీల్స్' కూడా ఎంతగానో దోహదపడ్డాయని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'యువ నాటకోత్సవాలు' ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ మాట్లాడుతూ.. కళలకు ఎంతో శక్తి ఉందని, అందుకు తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన విజయమే నిదర్శనమని అన్నారు. వినూత్నంగా ఆలోచిస్తే విజయం తథ్యమని, సోషల్ మీడియా ప్రభావం ఆ స్థాయిలో ఉందని పేర్కొన్నారు. కళారంగం, నాటక రంగంలోకి యువతరం రావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికల్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన డీఎంకే, ఏఐఏడీఎంకేలను వెనక్కి నెట్టి టీవీకే పార్టీ అనూహ్య విజయం సాధించింది. మొత్తం 234 స్థానాలకు గాను 108 స్థానాలను కైవసం చేసుకుని అధికారానికి చేరువైంది. 2024లో పార్టీని స్థాపించిన రెండేళ్లకే విజయ్ ఈ ఘనత సాధించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఈ నేపథ్యంలో కళలను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే సంగీతం, నాట్యం, నాటకం వంటి అంశాల్లో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి వివేక్ సూచించారు.

## పవన్ కల్యాణ్ చొరవ.. వర్తనపల్లి శివాలయానికి టీటీడీ రూ. 55 లక్షలు మంజూరు!

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో శివాలయ పునర్నిర్మాణం**

**వర్తనపల్లి ఆలయానికి రూ. 55 లక్షలు మంజూరు చేసిన టీటీడీ**

**పాడేరు పర్యటనలో గ్రామస్థులకు హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్**

**ఆలయంతో పాటు కొత్త విగ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు ప్రణాళిక**



ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో శిథిలావస్థకు చేరిన శివాలయానికి మహర్దశ పట్టనుంది. పాడేరు నియోజక వర్గంలోని వర్తనపల్లి గ్రామ శివాలయం పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ. 55 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వివరాల్లోకి వెళ్తే, గత మార్చి 14న పవన్ కల్యాణ్ పాడేరు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వర్తనపల్లి గ్రామస్థుల కోరిక మేరకు, సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన శివాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరగా, టీటీడీ సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన అక్కడికక్కడే హామీ ఇచ్చారు.పర్యటన ముగిసిన వెంటనే పవన్ కల్యాణ్ ఈ విషయంపై టీటీడీకి లేఖ రాశారు. ఆయన విజ్ఞప్తి మేరకు టీటీడీ సాంకేతిక బృందం గ్రామంలో పర్యటించి అంచనాలు రూపొందించింది. ఈ నిధులతో శివాలయ పునర్నిర్మాణంతో పాటు సింహవాహనంతో కూడిన అమ్మవారి విగ్రహం, మూషిక వాహనంతో గణపతి, నెమలి వాహనంతో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ధ్వజస్తంభం, భక్తులకు బెంచీలు, బోర్ వెల్ తో కూడిన తాగునీటి సౌకర్యం, మైక్ సిస్టమ్ వంటివి కూడా కల్పించనున్నారు.ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com